ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 1 డిసెంబరు 2025



నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావద్దని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ ఎన్నికలు మాడల్ కోడ్ అమలులో ఉన్నందున అధికారులు ఎన్నికల విధులలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన

- తగ్గిన కేసులు ● జాగ్రత్తలు వహిస్తున్న బాధితులు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం



కళ్యాణ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించ డం, ఎయిడ్స్ సోకిన బాధితులకు పౌష్టికాహారం అందించడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో నిర్మూలన సాధ్యమవుతోంది. ఎయిడ్స్ బాధితులకు కౌన్సెలింగ్ సెంటర్ల ద్వారా భరోసా కల్పిస్తూ మనోధైర్యాన్ని నింపుతుండడంతో క్రమంగా ఎయిడ్స్ నిర్మూలన తగ్గుతూ వస్తుంది. ఒకప్పుడు రామగుండం పారిశ్రామిక ప్రాం తంలో నెలకు 300 నుంచి 400కేసులు నమోదు కాగా ఇప్పుడు ఏడాదికి 30 నుంచి 60కేసులు నమోదవుతున్నాయి.

ఎయిడ్స్ లక్షణాలు

ఎయిడ్స్ సోకిన వ్యక్తికి మొదట ఫ్లూ లాంటి లక్షణాలు కనబడడం, తరచూ జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, గొంతు నొప్పి, అలసట, ఒంటిపై దద్దుర్లు, నోటిలో పుండ్లు లక్షణాలు అగుపిస్తాయి. రక్త పరీక్ష చేయించుకోవడం వల్ల వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకోవచ్చు. హెచ్ఐవీ సోకిన వారికి రోగ నిరోధక శక్తి తగ్గి రోజు రోజుకు బలహీనంగా మారి మృతి చెందే అవకాశం ఉంటుంది. విచ్చలవిడిగా శృంగారం, ఒకరు వాడిన సిరంజిలు మరొకరికి వాడడం, రక్తమార్పిడి ద్వారా ఎయిడ్స్ వ్యాధి సంక్రమిస్తుంది. తల్లి నుంచి బిడ్డకు కూడా ఎయిడ్స్ వచ్చే ప్రమాదం ఉంది. దీనిని ముందే గుర్తించి తల్లి నుంచి బిడ్డకు ఎయిడ్స్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోలేదు.

రెండేళ్లలో 93కేసులు

గోదావరిఖని ఏఆర్‌టీసీ సెంటర్‌లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 7441 మందికి ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించగా 33 మందికి, 2024 మార్చి నుంచి 2025 నవంబర్ వరకు 6,335మందికి పరీక్షలు నిర్వహించగా 60మంది ఎయిడ్స్ బారిన పడ్డారు. వీరికి ఏఆర్‌టీసీ సెంటర్‌లో కౌన్సెలింగ్, మందులు ఇస్తున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ఎయిడ్స్ నిర్మూలించవచ్చు...

శంకర్, ఐసీటీసీ కౌన్సిలర్



అవగాహన లేకపోవడం వల్ల ఒకరి నుంచి మరొకరికి ఎయిడ్స్ వ్యాధి సంక్రమిస్తుంది. విచ్చలవిడి శృంగారం, గుర్తింపు లేని బ్లడ్ బ్యాంకుల ద్వారా రక్తమార్పిడి చేయించుకోవడం, జాగ్రత్తలు పాటించక పోవడం వల్ల గతంలో కేసుల సంఖ్యలు పెరిగేవి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతం నుంచి గ్రౌండ్ లెవల్‌లో అవగాహన కల్పించడం వల్ల కేసుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ఎయిడ్స్ సోకిన వ్యక్తులకు ఏఆర్‌టీసీ సెంటర్ ద్వారా పౌష్టికాహారం, జీవన విధానంలో మార్పులపై అవగాహన కల్పిస్తున్నాం. ఎయిడ్స్ సోకిన వారితో మాట్లా డడం, ఉమ్ము ద్వారా, వస్తువులు తాకినా ఎయిడ్స్ వ్యాధి రాదు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

నేటి నుంచి కొత్త మద్యం షాపులు...

- జిల్లాలో 75షాపులకు లైసెన్స్‌లు
- రామగుండంలోనే 24షాపులు

కోల్‌సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం ఈ మేరకు వ్యాపారులకు లైసెన్స్‌లు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 75మద్యం షాపులు ప్రారంభించనున్నారు. రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు, వివిధ మండలాల్లో కొత్త షాపులు ఏర్పాటు కానున్నాయి. రామగుండం ఎక్సైజ్ పరిధిలో 24మద్యం షాపులు ఏర్పాటు కానున్నాయి. ఇందులో రామగుండం అర్బన్‌లో 20, అంతర్గాంలో ఒకటి, పాలకుర్తి మండలంలో మూడు షాపులు ఏర్పాటు చేయనున్నారు. ఈ సారి ఎక్సైజ్ పాలసీలో మార్పులు చేయడంతో వ్యాపారులకు అడ్డాల సమస్య తలెత్తింది. మున్సిపాలిటీ పరిధిలో లైసెన్స్ ఎక్కడ వచ్చినా ఆ మున్సిపల్ ఏరియాలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించారు. రామగుం డంలో రెండు క్లస్టర్లు ఏర్పాటు చేశారు. కార్పొరేషన్‌లో గిరాకీలు తక్కువ ఉన్నాయంటూ మూడు షాపులను హైదరాబాద్‌కు మార్చారు. అందులో యైటింక్లయిన్‌కాలనీ, గోదావరిఖని షాపులు ఉన్నాయి. కానీ యైటింక్లయిన్ క్లస్టర్ లోనే గతం మూడు షాపులు ఉంటే ఇప్పుడు నాలుగు షాపులు ఏర్పాటు చేశారు. ఎన్‌టీపీ సీలో నాలుగు షాపులకు గాను ఐదు షాపులు ఏర్పాటు చేశారు. రోడ్లు, కూడళ్ల విస్తరణను దృష్టిలో ఉంచుకుని ఎక్సైజ్‌శాఖ పలు ప్రాంతాల్లో షాపులు ఏర్పాటు చేయవద్దని సూచించింది. కానీ వ్యాపారులు రిస్క్ తమదేనంటూ లేఖలు ఇచ్చి మరీ ఆ అడ్డాలలో షాపులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సారి షాపులు కూడా పెద్ద ఎత్తున చేతులు మారాయి. ఒక్కో షాపునకు లైసెన్స్ వచ్చిన వ్యాపారులు పలువురు షాపులు అమ్మారు. ఒక్క రామగుండంలోనే ఐదు షాపులు అమ్ముడయ్యాయి. రూ.52లక్షల నుంచి రూ.65లక్షల రేట్లపై షాపులు అమ్మకాలు జరిగి నట్టు తెలుస్తుంది. ఈ సారి వ్యాపారం లాభదాయకంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి సర్పంచ్, అర్బన్‌కు సంబంధించి మున్సిపల్ ఎన్నికలు, సమ్మక్క జాతర కలిసి వస్తాయని భావిస్తున్నారు.

ఉంగరం.. కత్తెర

- సర్పంచ్ అభ్యర్థులకు 30...
- వార్డు సభ్యులకు 20...
- అక్షర క్రమంలో గుర్తుల కేటాయింపు
- ఈసారి నోటాకు అవకాశం



పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుట్ బాల్, లేడీస్ పర్సు, టూత్ పేస్ట్... ఇలా 30 రకాల గుర్తులను సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థులకు కేటాయించనున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయావకాశాల్లో గుర్తులు కీలకపాత్ర పోషిస్తాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ఓటర్లు ఎక్కువగా గుర్తుంచుకునే గుర్తులు తమకు రావాలని కోరుకుంటారు. రిటర్నింగ్ అధికారులు కేటాయించే గుర్తులపైనే అభ్యర్థుల విజయావకాశాలు ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదలుకొని అసెంబ్లీ, లోకసభ ఎన్నికల వరకు అన్నీ పార్టీల గుర్తులపైనే కొనసాగుతాయి. స్వతంత్ర అభ్యర్థులకు మినహా జాతీయ రాష్ట్ర రిజిస్టర్ పార్టీల తరఫున, పోటీ చేసే అభ్యర్థులకు ఆ పార్టీల గుర్తులనే కేటాయిస్తారు. అయితే పార్టీలకతీతంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లో మాత్రం ప్రత్యేక గుర్తులను కేటాయిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 50 గుర్తులను ఎన్నికల సంఘం ఖరారు చేసింది. సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులను కేటాయించింది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో మిగిలే అభ్యర్థులకు గుర్తులను కేటాయించనున్నారు. సర్పంచ్ అభ్యర్థులు బ్యాలెట్ పేపర్ గులాబీ (పింక్) రంగులో, వార్డు సభ్యుల బ్యాలెట్ పేపర్ తెలుపు (వైట్) రంగులో ఉండనున్నాయి.

గుర్తుల కేటాయింపు ఇలా..

నామినేషన్ల ఉపసంహరణ సమయం ముగిసిన తర్వాత రిటర్నింగ్ అధికారి ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను అక్షర క్రమంలో సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఇద్దరు అంత కంటే ఎక్కువ మందికి ఒకే పేరు ఉండి, వేర్వేరు ఇంటి పేర్లు ఉంటే, వారి ఇంటి పేర్లను సూచిస్తూ అక్షర క్రమంలో అమర్చనున్నారు. ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులకు ఒకే పేరు, ఒకే ఇంటి పేరు ఉంటే వారి వ్యక్తి నివాసం, చిరునామా ప్రాతిపదికన జాబితాలో చేర్చనున్నారు. సర్పంచ్ పదవికి గుర్తించిన గుర్తుల జాబితాలో అక్షర క్రమంలో మొదటి అభ్యర్థికి మొదటి గుర్తును కేటాయిస్తారు. ఆ తర్వాత గుర్తును జాబితాలోని రెండో అభ్యర్థికి, తర్వాత మిగిలిన గుర్తులను అక్షర క్రమంలో తర్వాత ఉన్న అభ్యర్థులకు ఖరారు చేస్తారు. వార్డు సభ్యులకు గుర్తులను ఇదే విధానంలోనే కేటాయిస్తారు.

సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు..

సర్పంచ్ అభ్యర్థులకు ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీస్ పర్సు, టూత్ పేస్ట్, టీవీ రిమోట్, స్పానర్, చెత్త డబ్బా, బ్లాక్ బోర్డు, బెండకాయ, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, జల్లెడ, చేతి కర్ర, మంచం పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, తెర చాపతో పడవ, బిస్కెట్, ఫ్లూట్, చైన్, చెప్పులు, బెలూన్, క్రికెట్ స్టంప్స్ గుర్తులు కేటాయించారు.

వార్డు సభ్యుల గుర్తులు..

వార్డు సభ్యుల అభ్యర్థులకు గౌను, గ్యాస్ పొయ్యి.

(మిగతా 8వ పేజీలో)

మొదటి విడతలో జోరుగా నామినేషన్లు

- సర్పంచ్ స్థానాలకు 823
- వార్డు స్థానాలకు 2146

పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడతలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో జోరుగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఐదు మండలాల్లోని 99 పంచాయతీల్లో 823 మంది అభ్యర్థులు సర్పంచ్ స్థానానికి నామినేషన్లు దాఖలు చేయగా, 896 వార్డు స్థానాలకు 2146 మంది నామినేషన్లు వచ్చాయని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య తెలిపారు. అన్ని స్థానాలకు నామినేషన్లు దాఖలు కావడం గమనార్హం.

- కమాన్‌పూర్ మండలంలోని తొమ్మిది పంచాయతీల్లో సర్పంచుకు 93 నామినేషన్లు, 92 వార్డు స్థానాలకు 253 నామినేషన్లు వచ్చాయి.
- మంథని మండలంలోని 35 పంచాయతీల్లో సర్పంచుకు 270 నామినేషన్లు, 270 వార్డు స్థానాలకు 282 నామినేషన్లు వచ్చాయి.
- ముత్తారం మండలంలోని 15 పంచాయతీల్లో సర్పంచ్ స్థానానికి 128 నామినేషన్లు, 138 వార్డు స్థానాలకు 339 నామినేషన్లు వచ్చాయి.
- రామగిరి మండలంలోని 16 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 160 నామినేషన్లు రాగా, 158 వార్డు స్థానాలకు 449 నామినేషన్లు వచ్చాయి.
- కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని 24 పంచాయతీల్లో సర్పంచుకు 172 నామినేషన్లు రాగా, 226 వార్డు స్థానాలకు 490 నామినేషన్లు వచ్చాయి.

రెండో విడత మొదలైన నామినేషన్ల పర్వం

- తొలిరోజు 233 నామినేషన్లు

పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం ఆదివారం ప్రారంభమైంది. తొలిరోజు అతి తక్కువగా నామినేషన్లు దాఖలయ్యాయి. అంతర్గాం, ధర్మారం, జూలపల్లి, పాలకుర్తి మండలాల్లో గల 73 గ్రామ పంచాయతీల్లోని సర్పంచ్ స్థానాలకు 91 నామినేషన్లు రాగా, 684 వార్డు స్థానాలకు 142, మొత్తం 233 నామినేషన్లు వచ్చాయి. మంగళవారం నాటికి నామినేషన్ల గడువు ముగియనుంది.

మండలం	పంచాయతీలు	సర్పంచ్ నామినేషన్లు	వార్డులు	వార్డు సభ్యుల నామినేషన్లు
అంతర్గాం	15	12	132	15
ధర్మారం	29	25	266	47
జూలపల్లి	13	22	130	36
పాలకుర్తి	16	32	156	44
మొత్తం	73	91	684	142

రామగుండంలో విద్యుత్ కేంద్రం నిర్మిస్తాం

- బీఆర్ఎస్ అడ్డుపడితే ప్రజలే బుద్ధి చెబుతారు...
- కమీషన్ల బండారం బయట పడుతుందనే బురద జల్లుతున్నారు : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, హాజరైన ప్రజలు

గోదావరిఖని/పాలకుర్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్ని శక్తులు అడ్డుపడ్డా ప్రజల అభీష్టం మేరకు విద్యుత్ కేంద్రం కట్టి తీరుతామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం స్థాపనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఆదివారం రామగుండం పట్టణానికి వచ్చిన ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. బీ పవర్‌హౌస్ గడ్డ నుంచి రామగుండం పట్టణం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బొగ్గు, నీరు, భూమి ఉన్న రామగుండంలో విద్యుత్ కేంద్రం కట్టకుండా అవేవీ అందుబాటులో లేని యాదాద్రిలో కమీషన్ల కోసం విద్యుత్ కేంద్రం కట్టిందన్నారు. మెగావాట్‌కు రూ.8కోట్ల అంచనాలతో ప్రారంభించి రూ.13కోట్ల అంచనాలకు చేరిందన్నారు. ఆ ఖర్చుతో రామగుండంలో 800 మెగా వాట్ల 7యూనిట్లు నిర్మించే అవకాశం ఉండేదన్నారు. యాదాద్రిలో జరిగిన వేల కోట్ల రూపాయల అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు రామగుండంలో విద్యుత్ కేంద్రం ఏర్పాటును ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ కేంద్రాలకు రూ.22వేల కోట్ల పెట్టుబడి అంచనా అయితే రూ.50వేల కోట్ల అవినీతి అని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సోలార్, హైడల్, సంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లతోపాటు థర్మల్ విద్యుత్ అనివార్యమైందన్నారు. మన కన్నా వంద రెట్లు అభివృద్ధి చెందిన యూరప్ దేశాల్లో సైతం థర్మల్ పవర్‌ప్లాంట్లు లేకపోవడం వల్ల గ్రిడ్ కుప్ప కూలిందన్నారు. రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ తప్పనిసరి అని కేంద్రమే చెబుతుందన్నారు. రామగుండంలో విద్యుత్ కేంద్రం రావడాన్ని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అడ్డుపడే ప్రయత్నం చేస్తున్నారని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలే సమాధానాలు చెబుతారన్నారు. రామగుండంలో పుట్టి పెరిగిన తాను ఈ ప్రాంత అభివృద్ధికి నిత్యం పాటుపడుతానని పేర్కొన్నారు. ఇప్పటికే రామగుండం పట్టణంలో రోడ్ల విస్తరణతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మనాలీ ఠాకూర్, దీటి బాలరాజు, బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఈదునూరి హరి ప్రసాద్, అంజుల్, అశ్రఫ్, సింగం సత్తయ్యగౌడ్, శ్రీపతి రాజగోపాల్, సలీం పాల్గొన్నారు.

జాతీయ రెస్క్యూ పోటీలకు సింగరేణి జట్లు



ఎంపికైన మహిళా జట్టు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగ్‌పూర్‌లో జరగనున్న జాతీయ రెస్క్యూ పోటీలకు సింగరేణి జట్టు ఆదివారం వెళ్లింది. ఆర్జీ-2లోని రెస్క్యూ ప్రధాన స్టేషన్ నుంచి మూడు జట్లు నాగ్‌పూర్ వెళ్లాయి. సెప్టెంబర్‌లో జరిగిన జోనల్ మైన్స్ పోటీల్లో ప్రతిభ కనబ ర్చిన రెస్క్యూ సభ్యుల్లో 24 మందిని ఎంపిక చేసి మూడు జట్లుగా ఏర్పాటు చేశారు. ఎనిమిమిది మంది చొప్పున రెండు పురుషుల జట్లు, ఒక మహిళా జట్టును ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నాగ్‌పూర్‌లో జాతీయ స్థాయి పోటీలు జర గనున్నాయి. నెల రోజులపాటు సింగరేణి జట్ల సభ్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాధారణ ఎన్నికల పరిశీలకులు నర్సింహారెడ్డి, పాల్గొన్న కలెక్టర్ శ్రీహర్ష, డీసీపీ రాంరెడ్డి

పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రాంరెడ్డి, అదనపు కలెక్టర్‌లు జె అరుణశ్రీ, డి వేణులతో కలిసి ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఎన్నిక మొదటిసారిగా నిర్వహిస్తున్నట్లు భావించి అధికారులు పని చేయాలన్నారు. ఎంసిసి అమలులో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించేలా చూడాలన్నారు. ప్రచార ఖర్చు వివరాలు కట్టుదిట్టంగా అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని అన్నారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలు వేర్వేరు ఉన్న చోట బ్యాలెట్ తరలింపు అప్రమత్తంగా చేయాలన్నారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు వైన్‌షాప్స్ మూసి వేయాలని, పంచాయతీ ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించాలని, ఎక్కడ చిన్న పొరపాటు కావడానికి ఆస్కారం లేదని, ఫ్రీఅండ్‌ఫెయిర్‌గా ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఓటర్లను ప్రలోభ పెట్టకుండా నిఘా పెట్టాలన్నారు. ఉద్యోగులు, సిబ్బంది ఎక్కడా కూడా ఎన్నికల ప్రచారంలో భాగస్వామ్యం కావద్దని, అభ్యర్థుల ఫిర్యాదుల స్వీకరణకు ఏర్పాటు చేయాలని, చిన్న ఫిర్యాదును కూడా నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేస్తున్నామని, ఎన్నికల ప్రచార ఖర్చులను నమోదు చేసేందుకు ధరల లిస్టు సిద్ధం చేశామని అన్నారు. కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, 24 గంటలు పని చేసేలా మూడు షిఫ్టులలో సిబ్బంది నియమించామన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ర్యాలీలు, సభల నిర్వహణకు తహసీల్దార్, పోలీస్ అధికారులు అనుమతి అందించేలా వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల సిబ్బంది కేటాయింపు పోలింగ్ కేంద్రాల వారీగా 3వ ర్యాండమైజేషన్ సాధారణ పరిశీలకుల ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. ఎటువంటి దుర్ఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రౌడీ షీటర్లు, గత ఎన్నికల్లో సమస్యలు సృష్టించిన వారిని బైండోవర్ చేయాలని అన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు. కులాలు, మతాల మధ్య ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలు ఉపేక్షించడం జరగదని, బెల్ట్ షాపులను మూసి వేస్తున్నామన్నారు. ఆర్డీఓలు బి.గంగయ్య, సురేష్, డీసీపీ. రామ్ రెడ్డి ,ఏసిపి రమేష్, జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య పాల్గొన్నారు.

దేశీయ విత్తన ఉత్పత్తికి బీజం
● సేంద్రియ ఎరువులతో మేలు రకం విత్తనాల తయారీ 7

సాంబయ్యపల్లిలో విషాదం
● కరీంనగర్ నగునూరు వద్ద రోడ్డు ప్రమాదం
● దంపతులను ఢీకొన్న లారీ
● భర్త మృతి భార్యకు తీవ్ర గాయాలు 6

కోల్ ఇండియా కబడ్డీ పోటీల్లో రన్నరప్‌గా సింగరేణి జట్టు 8

పొగ మంచులో ప్రయాణం.. జాగ్రత్త...

- కమ్ముకుంటున్న పొగ మంచు
- వాహనదారులకు ఇబ్బందులు
- ఆదమరిస్తే అంతే సంగతి
- జాగ్రత్తలు తప్పనిసరి



పొగ మంచు కారణంగా రహదారిపై లైట్లు వేసుకొని వస్తున్న వాహనాలు

ముత్తారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత శీతాకాలంలో విపరీతమైన చలి, పొగమంచు కారణంగా ప్రయాణం ప్రమాద కరంగా మారింది. వేకువజామున పొగమం చుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనం దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలున్నాయి. ఈ సమయంలో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదమే. చలి కాలంలో అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు పొగ మంచు కారణంగానే జరుగుతుంటాయి. ఈ క్రమంలో వాహనచోదకులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ప్రయాణం సాఫీగా సాగుతుంది.

ప్రమాదాలకు కారణాలు...

- పొగమంచులో అధిక వేగంతో వాహనాలు నడపటం
- రహదారులపై ఎలాంటి సూచికలు లేకపోవడం
- మద్యం మత్తులో వాహనదారులుండటం
- ఎలాంటి ఇండికేటర్లు వేయకుండా రహదారి పక్కనే వాహనాలను నిలపడం
- పొగమంచులో మూలమలుపులను గమనించకపోవడం

పాటించాల్సిన జాగ్రత్తలు...

- నియంత్రిత వేగంతో ప్రయాణించడం
- పొగ మంచులో హెడ్ లైట్ ఆన్ చేసుకొని వెళ్లడం విండ్ షీల్డ్‌పై మంచు పేరుకుపోకుండా వైపర్స్ ఆన్‌చేసుకోవడం
- వాహనానికి రేడియం స్టిక్కర్లు అతికించుకోవడం బ్రేక్ సిగ్నల్ లైట్ పని చేసేలా చూసుకోవడం

పొగ మంచులో జాగ్రత్తలు పాటిస్తేనే ప్రయాణం సుగమం

- ఎన్.రవికుమార్, ఎస్ఐ, ముత్తారం.

పొగ మంచులో ప్రయాణించేటప్పుడు వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి. అతివేగంగా ప్రయాణించవద్దు. హెడ్ లైట్లు ఆన్ చేసుకొని ప్రయాణించడం మంచిది. తద్వారా ఎదురుగా వచ్చే వాహనానికి మన వాహనం కనిపిస్తుంది. బ్రేక్ సిగ్నల్ లైట్ కూడా పని చేసేలా చూసుకోవాలి. ప్రయాణం ఉదయం వేళ కాకుండా పొగ మంచు పోయాక వెళ్లడం మరింత మంచిది

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్, మొగ్ధుంపూర్ గ్రామాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మానేరు వాగు నుంచి ఇసుకను దొంగలించి కరీంనగర్‌లో విక్రయించేందుకు ట్రాక్టర్లలో తరలిస్తుండగా పట్టుకున్నామని సీఐ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు అలవేని అనిల్, దాసరి నరేష్, గాజుల శివకృష్ణ, శ్రీరామోజు తిరుపతిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తప్పవని సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు.

లభ్యంకాని మృతుడి వివరాలు

జమ్మికుంట రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శంభునపల్లి శివారులో లభించిన గుర్తు తెలియని యువకుడి మృతదేహం వివరాలు తెలియరాలేదు. క్లూస్ టీం మృతుడి శరీర భాగాల నుంచి శాంపిల్స్ సేకరించింది. డాగ్ స్క్వాడ్ మృతదేహం పడి ఉన్న ప్రాంతం మొత్తం తిరిగింది. హంతకులు మద్యం తాగిన ఆనవాళ్లు తప్ప మిగతా క్లూ వదిలిపెట్టలేదు. అన్ని పోలీస్ స్టేషన్లకు మృతుడి ఫొటోలు, వివరాలు పంపించినా ఫలితం లేదు. శంభునిపల్లికి గుంపుల క్రాస్ రోడ్, వావిలాల, తనుగుల గ్రామాల మీదుగా రాకపోకలు తప్ప ఇతర మార్గాలు లేవు. దీంతో పోలీసులు మూడు ప్రధాన రోడ్ల గుండా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. హంతకులు సెల్‌ఫోన్లు కూడా వెంట తెచ్చుకోనట్లు సమాచారం.



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

రేషన్‌బియ్యం కోసం ఆదివాసీల తిప్పలు



- చిన్నకొల్వాయిలో రేషన్‌షాపు లేక నాలుగు కిలోమీటర్ల నడక
- పట్టించుకోని అధికారులు, పాలకులు



చిన్నకొల్వాయి గ్రామం

బీర్‌పూర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఆదివాసీల పరిస్థితులు మాత్రం మారడం లేదు. బీర్‌పూర్ మండలంలోని చిన్నకొల్వాయి గ్రామంలో రేషన్‌దుకాణం లేక ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నకొల్లాయి ఒకప్పుడు కొల్వాయికి అనుబంధ గ్రామంగా ఉండగా ప్రస్తుతం నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఈ గ్రామంలో 50 కుటుంబాలు ఉండగా 200 జనాభా ఉంది. వీరు ప్రతి నెల ప్రభుత్వం చౌకధరల దుకాణం ద్వారా అందించే బియ్యం కోసం సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం కాలినడకన కొల్వాయి గ్రామానికి వెళ్లి తెచ్చుకుంటున్నారు. నాలుగు కిలోమీటర్లు నడవడమే కష్టం కాగా బియ్యాన్ని మోసుకొని పోవడం మరి ఇబ్బంది అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్‌షాపు ఏర్పాటు చేయాలి

-మాజీ సర్పంచ్ చిక్రం రవీందర్, చిన్నకొల్వాయి



మా గ్రామంలో ప్రత్యేక రేషన్ షాప్ ఏర్పాటు చేసి అందరికీ రేషన్‌బియ్యం పంపిణీ చేయాలి. ఈ విషయ మై అనేక సార్లు అధికారులు, నాయ కుల దృష్టికి తీసుకెళ్లాం. ఎవరూ మా బాధలను పట్టించుకోవడం లేదు. ప్రతి నెల నాలుగు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి రేషన్‌బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది.

బియ్యం కోసం ఇబ్బంది పడుతున్నాం

-కొట్నాక గంగవ్వ, చిన్నకొల్వాయి



మేము నాలుగు కిలోమీటర్ల దూరం మేము నడవడమే కష్టంగా ఉంది. ఇంకా మా బియ్యాన్ని ఎలా మోసుకొని పోతాము. పెద్ద సార్లు మా గోస చూసి మా గూడెంలో రేషన్‌దుకాణం పెట్టి బియ్యం తీసుకునేటట్టు చేయాలి

ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతి

మంథనిరూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెంద వద్ద గోదావరి నదిలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పంచిక సదయ్య (40) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన సదయ్యకు మల్లన్న బోనాలు ఉండటంతో బంధువులతో కలిసి గోదావరి నది స్నానానికి వెళ్లాడు. స్నానం చేసిన అనంతరం ఇసుక కోసం తిరిగి గోదావరి నదిలోకి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. అతని వెంట వెళ్లిన బంధువులు అతని రక్షించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. గోదావరి నదిలో గల్లంతయిన సదయ్య కోసం సుమారు రెండు గంటల పాటు గాలించిన అనంతరం మృతదేహన్ని గ్రామస్థులు వెలికితీశారు. సదయ్యకు భార్య మమత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం ప్రభుత్వ పాఠశాల ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్‌కు చెందిన నిమ్మటూరి సాయికృష్ణ, అతని భార్య రమతో కలిసి హుజూరాబాద్ నుంచి కరీంపేటకు వెళ్తున్నాడు. కరీంపేట నుంచి కేశవపట్నం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సాయికృష్ణ చేతికి, పక్కటెముకలకు గాయాలయ్యాయి. అతని భార్య కుడికాలుకు గాయమైంది. గమనించిన స్థానికులు 108 వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్ కిందపడి యువకుడి మృతి

గంగాధర(రామడుగు), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రామడుగు మండల కేంద్రంలో టిప్పర్ వెనక టైర్లు మీదనుంచి వెళ్లగా ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రామడుగు మండల కేంద్రానికి చెందిన మామిడి వెంకటేష్(39) అనే యువకుడు తన టిప్పర్ బ్రేక్ డౌన్ కావడంతో రోడ్డు పక్కన నిలిపి మరమ్మతులు చేస్తున్నాడు. ఈక్రమంలో వెంకటేశ్ తమ్ముడు మామిడి నరేష్ టిప్పర్‌ను ముందుకు నడిపించాడు. ఈక్రమంలో టిప్పర్ వెనక టైర్లు వెంకటేశ్‌పై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వెంకటేష్ తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డునపడిన బతుకులు..

- కొండగట్టు అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి.. - కట్టుబట్టలతో బాధితులు - రూ.కోటికిపైగా నష్టం

వారంతా బొమ్మలు అమ్ముకొని జీవించే సామాన్యులు.. సమ్మక్కసారక్క జాతర రానుండడంతో కొండగట్టుకు భక్తుల రాక ఎక్కువగా ఉంటుందని, తమ వ్యాపారం కాస్తా కలిసివస్తుందని.. అప్పులు చేసి లక్షల రూపాయల విలువైన బొమ్మలు, ఆట వస్తువులు, పూజాసామగ్రి తెచ్చుకున్నారు. దుకాణం అంతా నింపుకోగా శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదంతో వారి ఆశలు ఆవిరయ్యాయి. వస్తువులతో పాటు ఇంటి సామగ్రి సర్వం బుగ్గి అయ్యింది. బాధిత కుటుంబాలు రోడ్డునపడి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



రోదిస్తున్న బాధితులు

మల్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ కొండగట్టులోని అభయాంజనేయస్వామి విగ్రహం ముందు గల దారికి ఇరువైపుల ప్రైవేట్ వ్యక్తుల వద్ద అనేక మంది స్థలం అద్దెకు తీసుకొని అనేక దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. శనివారం రాత్రి సమీపంలోని విద్యుత్ స్తంభం వద్ద నుంచి వెళ్లిన తీగలు షార్ట్‌సర్క్యూట్‌కు గురికావడంతో మొదట అక్కడ గల ఒక్క దానికి మంటలు వ్యాపించి నిమిషాల వ్యవధిలోనే ఇరవైకి పైగా దుకాణాలు మంటల్లో చిక్కుకున్నాయి. అందులో ప్లాస్టిక్ వస్తువులే అధికంగా ఉండడంతో మంటలు దట్టంగా చెలరేగాయి. దీంతో దుకాణాల్లో నివాసముంటున్న కుటుంబాలు కట్టుబట్టలతో బయటకు పరుగులు తీయగా కళ్లెదుటే సర్వం బుగ్గి కావడంతో వారి రోదనలు మిన్నంటాయి.

● ఆలస్యంగా వచ్చిన ఫైర్ ఇంజన్..

ప్రమాదం జరిగిన వెంటనే జగిత్యాలలోని ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించగా సుమారు గంటన్నర వరకు రాలేదని బాధితులు తెలిపారు. సమాచారం అందించినప్పుడు కేవలం మూడు దుకాణాలకు మాత్రమే మంటలు వ్యాపించాయన్నారు. ఫైరింజన్ వచ్చే వరకు మొత్తం ఇరవైకి పైగా దుకాణాలు కాలి బూడిదయ్యాయి. దుకాణాల్లో నివాసముంటున్న కుటుంబాలకు చెందిన ఇంటి సామగ్రి, కుట్టు మిషన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, బీరువాలు, బంగారం, నగదు తదితర వస్తువులు మంటల్లో దగ్ధం అయ్యాయి. ఫైర్ ఇంజన్ సకాలంలో చేరుకుంటే ఇంత నష్టం జరిగేది కాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం..

అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్‌తోనే జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. షార్ట్ సర్క్యూట్‌తో ఇనుప రేకులు చిల్లుల పడగా తీగలు ముద్ద అయ్యాయి. సంఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో వరంగల్ సీఈ అశోక్ పరిశీలించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా అగ్నిప్రమాదంలో కోటి నుంచి రెండు కోట్ల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు పేర్కొంటున్నారు. జాతర కోసం ఇటీవలే సామగ్రి తీసుకు వచ్చామని ఇంతలోనే ప్రమాదం జరగడం తీరని వేదన మిగిల్చిందని బాధితులు అంటున్నారు.

● సర్టిఫికెట్లు బుగ్గి..

అగ్నిప్రమాదంలో కరీంనగర్‌లో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న శ్వేత అనే విద్యార్థినికి చెందిన సర్టిఫికెట్లు కాలిపోయాయి. అలాగే అగ్రిప్రమాద వేడితో సమీపంలో గల దుకాణంలో గల అనిల్ అనే వ్యక్తికి చెందిన నలభై కోళ్లు బుగ్గి అయ్యాయి. అలాగే ఓ ఇళ్లు మంటలతో నల్లగా మారగా సమీప ఇళ్లల్లో వస్తువులు వేడికి చెడిపోయాయి. రెవెన్యూ అధికారులు నష్టం అంచనా వేస్తున్నారు.

● బాధితులకు ఆర్థికసాయం..

అగ్నిప్రమాదంతో సర్వం కోల్పోయిన అనేక కుటుంబాలకు కట్టు బట్టలే మిగిలాయి. బాధిత కుటుంబాలను ప్రస్తుతం అధికారులు సమీపంలో గల శ్రీనాథ్ రెసిడెన్సీలో బస కల్పించారు. రెవెన్యూ అధికారులు ఒక్కో కుటుంబానికి తక్షణ సాయంగా రూ.5వేల నగదు, 10కిలోల బియ్యం అందించారు. మరో రూ.15వేల సాయం సోమవారం అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కొండగట్టులో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటామని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ప్రమాద సంఘటన స్థలాన్ని మంత్రి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ప్రమాద ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. వారందరిని ఓదార్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ సంఘటన బాధకరం అని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరామని, ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రభుత్వం తరుపున అండగా ఉంటామని, అధైర్యపడవద్దని మంత్రి తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణ సాయం కింద రూ.20వేలతో పాటు సెర్ప్ ద్వారా వడ్డీ లేని రూ.5లక్షల వరకు రుణాలు అందించాలని అధికారులకు సూచిస్తామని తెలిపారు. షార్ట్ సర్క్యూట్ ద్వారా జరిగిన ప్రమాదం కాబట్టి విద్యుత్ శాఖ లక్ష రూపాయలు అందిస్తే చిరు వ్యాపారులంతా మళ్లీ షెడ్లు వేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడతూ బాధితులను పూర్తిగా ఆదుకుంటామన్నారు. వారి వెంట మాజీ మంత్రి టీ.జీవన్‌రెడ్డి ఉన్నారు.

● బీఆర్‌ఎస్ ఆర్థిక సహాయం

బాదిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ తరుపున మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రూ.5వేలు అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.30లక్షలు పరిహారంగా అందించాలని డిమాండ్ చేశారు. మాజీ జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, విండో చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు ఉన్నారు. ఈ ఘటనపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరా తీసి రవిశంకర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

● మంత్రి పొన్నం, కవిత విచారం

కొండగట్టు అగ్నిప్రమాదం ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్, జాగృతి అధ్యక్షురాలు కవిత విచారం వ్యక్తం చేశారు. కలెక్టర్‌తో మాట్లాడి ఆదుకోవాలని కోరినట్లు మంత్రి పేర్కొన్నారు. చిరు వ్యాపారుల దుకాణాలు బుగ్గి అయి సర్వం కోల్పోవడం తన మనసు కలచివేసిందని కవిత ఒక ప్రకటనలో అన్నారు. మానవత దృక్పతంతో ప్రభుత్వం ఆదుకోవాలని కవిత కోరారు.

● పెళ్లికి సిద్ధం చేసుకున్న బంగారం

పెళ్లికి సిద్ధం చేసుకున్న బంగారం అగ్రిప్రమాదంలో బుగ్గి అయినట్లు ఓ వ్యక్తి మంత్రి లక్ష్మణ్‌తో పేర్కొనడం అక్కడి వారందరిని కలచివేసింది. ఒక్కొక్కరూ తమ బాధలను చెబుతుంటే మంత్రి, ఎమ్మెల్యేలు చలించిపోయారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

కొండగట్టులో జరిగిన అగ్నిప్రమాద ఘటన ప్రాంతాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై పూర్తి నివేదిక అందించాలని తహసీల్దార్, ఇతర అధికారులను ఆదేశించారు. ప్రమాదంలో 25 దుకాణాలు పూర్తిగా, ఐదు దుకాణాలు పాక్షికంగా దగ్ధం అయినట్లు అధికారులు తెలిపారు. వారికి రూ.ఐదువేల చొప్పున సాయం అందించారు. ఆర్డీవో మధుసూధన్‌గౌడ్, తహసీల్దార్ వసంత, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ఆమని, ఆర్ఐ తిరుపతి, విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.







బాధితులతో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఘటనాస్థలాన్ని కలెక్టర్ సత్యప్రసాద్, బాధితులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

దారి దోపిడీకి పాల్పడిన నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ రోడ్డులో శనివారం అర్ధరాత్రి డీసీఎం డ్రైవర్ వద్ద నుంచి రూ. 22వేల నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన నిందితుల ముఠాను అరెస్టు చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జెండా వెంకటపూర్‌కు చెందిన తాళ్లపల్లి నవీన్ అనే వ్యక్తి తన సొంత డీసీఎం వ్యాన్‌లో వడ్ల లోడును నిజామాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడ వడ్ల లోడ్‌ను దింపి స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో జగిత్యాల-నిజామాబాద్ జాతీయ రహదారిలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద శనివారం అర్ధరాత్రి కాలకృత్యాల కోసం డీసీఎం వాహనాన్ని నిలిపాడు.

అదే సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన జగిత్యాల పట్టణంలోని పెరకపల్లి రోడ్‌కు చెందిన ఎర్రం సాయి, గాంధీ నగర్‌కు చెందిన నక్క గణేష్‌తో పాటు మరో బాలుడు వాహన డ్రైవర్ నవీన్‌పై కర్రలతో దాడి చేశారు. అతడి వద్ద ఉన్న రూ. 22 వేల నగదు, సెల్‌ఫోన్ దొంగిలించి పారిపోయారు. నవీన్ ఫిర్యాదు మేరకు జగిత్యాల పట్టణ పోలీసు లు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం పెరకపల్లి రోడ్డు వద్ద నిందితు లను పట్టుకుని దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. దొంగతనం జరిగిన 24 గంటల్లో నిందితు లను అరెస్టు చేసిన జగిత్యాల సీఐ కరుణా కర్, స్పెషల్ పార్టీ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

మద్యం పట్టివేత

ఇల్లందకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటకు చెందిన సమ్మయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేపట్టారు. 6,100 రూపాయల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

వీణవంక: మండలంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. శ్రీరాములపేటకి చెందిన కురిమిండ్ల రవీందర్ ఏడు వేల రూపాయల విలువైన మద్యం తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

గంభీరావుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామ చెరువు ప్రాంతంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అదే గ్రామంలోని రైతు గంద్యాడపు శంకర్‌కు చెందిన పాడి గేదె ఆదివారం మృత్యువాత పడింది. శంకర్ తన వ్యవసాయ పొలం వద్ద పాడి గేదెను కట్టేశాడు. మేత మేస్తున్న క్రమంలో విద్యుత్ తీగ తెడి పడడంతో పాడిగేదె మృత్యువాత పడింది. సుమారు రూ.50వేల విలువ ఉంటుందని బాధిత రైతు శంకర్ పేర్కొన్నాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

భక్తజన సంద్రమైన మల్లన్నపేట

- మల్లన్నకు బోనాలు సమర్పణ



బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

గొల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గొల్లపెల్లి మండలం మల్లన్నపేట శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలకు భక్తులు భారీ ఎత్తున తరలి రావడంతో మల్లన్నపేట గ్రామంలోని వీధులన్ని వేలాదిగా తరలివచ్చిన భక్త జనంతో కిటకిటలాడాయి. ఏటా మార్గశిర మాసంలో వచ్చే షష్ఠి ఉత్సవాలలో ఏడు వారాల పాటు మల్లన్నపేట శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో ఏడు వారాల పాటు ఉత్సవాలు జరుగుతాయి. షష్ఠి ఉత్సవాలలో మొదటి ఆదివారం కావడంతో పాటు సెలవు దినం కావడంతో మల్లన్న జాతరకు భక్తులు అదిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి శ్రీ స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ స్వామి వారికి వివిధ సేవా టికెట్ల ద్వారా లక్షా నాలుగువేల 5 వందల 40 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహనాదికారి విక్రమ్ తెలిపారు. జాతరకు వేలాది మంది భక్తులు తరలి రావడంతో ధర్మపురి సిఐ రాంనర్సింహ రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసు బృందం బారీ బందోబస్తు నిర్వహించింది. వైద్య సిబ్బంది భక్తులకు కావాల్సిన వైద్యం చేశారు. పంచాయతీ రాజ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆలయ ఫౌండర్ ట్రస్టీ శాంతయ్య, దేవాదాయ శాఖ సిబ్బంది, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు భక్తుల సేవలో తరించారు. ఎస్సైలు ఎం కృష్ణ, సాగర్ రెడ్డి, ఉదయ్ కుమార్, మహేష్, రవీందర్, సుప్రియ లు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- నగునూర్ వద్ద ఘటన





దూడం రఘురాం(ఫైల్), కొమ్మిడి దేవేందర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఇద్దరిని కబలించగా మరో ఇద్దరు చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. కరీంనగర్ శివారులోని నగునూర్- జూబ్లీనగర్ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. నగునూర్ గ్రామస్థులు, కరీంనగర్ రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సాంబయ్యపల్లికి చెందిన రైతు కొమ్మిడి దేవేందర్‌రెడ్డి(55), ఆయన భార్య హైమావతి కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ లోని వారి కూతురు ఇంట్లో జరిగిన మల్లన్న పట్నాల(పండుగ)కు హాజరై స్వగ్రామానికి ద్విచక్రవాహనం(టీఎస్ 22 ఇ 7746)పై బయల్దేరారు. రాత్రి 7:30 గంటల సమయంలో కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లికి చెందిన దూడం రఘురాం(31), తుంటి రమేష్ ద్విచక్రవాహనం(టీఎస్ 02ఈఫ 6487)పై నగునూర్ వైపునకు వస్తున్నారు. నగునూర్ పరిధిలోని ఓ వైద్య కళాశాల సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వాహనాలపై ఉన్న నలుగురు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో చొప్పదండి ఐకేపీ నుంచి ధాన్యం లోడ్‌తో కరీంనగర్‌కు వస్తున్న లారీ(ఏపీ 25 వీ 9888) అప్పటికే ద్విచక్రవాహనాలు ఢీకొని రోడ్డుపై పడిపోయిన నలుగురి పైనుంచి దూసుకెళ్లింది. ప్రమాదంలో కొమ్మిడి దేవేందర్‌రెడ్డి, దూడం రఘురాం మృతి చెందగా తొంటి రమేష్, దేవేందర్‌రెడ్డి భార్య హైమావతి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. అయితే ద్విచక్రవాహనం లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లుగా సమాచారం.

● రెండు గ్రామాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంతో సాంబయ్యపల్లి, చామనపల్లి గ్రామాల్లో విషాదం నెలకొంది. పండుగకు అల్లుడి ఇంటికి వచ్చి తిరిగి వెళ్తుండగా రైతు కొమ్మిడి దేవేందర్‌రెడ్డి మృతిచెందగా ఆయన భార్య హైమావతికి తీవ్రగాయాలవడంతో ఆ కుటుంబం తల్లడిల్లుతున్నది. చామనపల్లికి చెందిన దూడెం రఘురాం కరీంనగర్‌లో ఓ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. రఘురాం మరణించగా ఆయనతోపాటు ద్విచక్ర వాహనంపై ఉన్న స్నేహితుడైన రైతు తొంటి రమేష్‌కు తీవ్రగాయాలవగా వారి కుటుంబాలు రోదిస్తున్నాయి. రోడ్డు ప్రమాద ఘటన తెలుసుకున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ జి విజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మృతదేహాలను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చ్యురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.

నాడు కొడుకు.. నేడు తండ్రి..

కరీంనగర్ క్రైం/సుల్తానాబాద్: కన్న కొడుకు ఐదు సంవత్సరాల కిందటే మరణించగా... ఇప్పుడు తండ్రి మరణించడంతో ఆ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. నగునూర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుల్తానాబాద్ మండలం సాంబయ్యపల్లికి చెందిన దేవేందర్‌రెడ్డి, హైమావతి దంపతులకు కొడుకు, కూతురు ఉండగా ఐదేళ్ల కిందట కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో షాక్‌కు గురైన దేవేందర్‌రెడ్డి కుటుంబం ఇంకా తేరుకోకముందే దేవేందర్‌రెడ్డి ప్రాణాలను రోడ్డు ప్రమాదం కబళించింది. మరో వైపున హైమావతి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిపాలైంది. ఆమె కూతురు, అల్లుడు రోదిస్తుండడం అందరిని కంటతడిపెట్టిస్తున్నది. ఆదివారం ఉదయం సాంబయ్యపల్లి నుంచి కూతురు వద్దకు వచ్చిన దేవేందర్‌రెడ్డి దంపతులను సోమవారం వెళ్లాలని చెప్పినా ఇంటి వద్ద ఆయన తల్లి ఒకరే ఉందంటూ బయల్దేరారని, పావు గంటకే ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిందని అల్లుడు మహేందర్, కూతురు రోదించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పీడీ

రాయికల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తోపారపు అనూష, ఎండీ సనా రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పొరండ్ల కిరణ్, పీడీ కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 2 నుంచి 4వ తేదీ వరకు నల్గొండ జిల్లాలోని హాలియాలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనన్నున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

దత్తాత్రేయ నవరాత్రోత్సవాల్లో ఘనంగా పూజలు


దత్తాత్రేయస్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మొదట రామలింగేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ స్వామి ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల దత్తాత్రేయస్వామి ఆలయాల్లో స్వామి వారలకు పూలతో అలకంరణ చేశారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి వారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఒజ్జల సౌజన్య-నరేం దర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పౌరోహితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశీయ విత్తన ఉత్పత్తికి బీజం



సాగు చేసిన దేశీయ వరి విత్తనాలు

సేంద్రియ ఎరువులతో మేలు రకం విత్తనాల ఉత్పత్తి

రామగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులు, వాతావరణ కాలుష్యంతో నేలసారం తగ్గిపోతోంది. ఈ క్రమంలో రైతులు క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్ రైతులకు దేశీయ వ్యవసాయ విధానాలను, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యాన్ని తెలుపుతున్నాడు. అలాగే మేలు రకమైన విత్తనాలను రైతులకు అందిస్తున్నాడు.

● సాగు చేసిన ప్రత్యేక దేశీయ వరి వంగడాలు

కులాకర్: గర్భిణులకు సుఖ ప్రసవానికి ఉపయోగపడుతుంది.

పుంగార్: బాలింతలకు అధిక పాలవృద్ధికి దోహదపడుతుంది.

మపిలై సాంబా: యుక్త వయస్సు వారికి వీర్య వృద్ధికి తోడ్పాడుతుంది.

నవారా: మధుమేహ వ్యాధిగ్రస్తులకు వ్యాధి నియంత్రణకు, నివారణకు ఉపయుక్తంగా ఉంటుంది.

బ్లాక్‌రైస్: అన్ని రకాల నల్లబియ్యం రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి

శ్రీనివాస్‌కు వ్యవసాయంపై ఉన్న మక్కువ అతడిని వ్యవసాయ విద్య వైపు మళ్లించింది. జగిత్యాలలోని పొలాసలో డిప్లామా కోర్సు పూర్తి చేసి వ్యవసాయ విస్తరణ అధికారిగా 2011లో ఉద్యోగం సాధించాడు. 2016 నుంచి మేలు రకం విత్తనాలను సేకరించడం ప్రారంభించాడు.

ఖాళీ సమయాల్లో వ్యవసాయ క్షేత్రంలో దేశీయ విధా నంలో వరిసాగు చేపట్టాడు. రెండెకరాల్లో దేశవాళీ విత్తనోత్పత్తి ప్రారంభించి ప్రశంసలందు కున్నాడు. సుభాస్ పాలేకర్ స్ఫూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానం శ్రీనివాస్‌ను ఆకర్షించింది. దేశీయ వరి రకాల ఉత్పత్తికి కృషి చేసినందుకు రైతునేస్తం ఫౌండేషన్ ఉత్తమ రైతు అవార్డును శ్రీనివాస్‌కు అందజేశారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వ ర్యంలో తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో కర్షక రత్న అవార్డును అందుకున్నారు. ఇటీవల సర్వేజనా సుఖినోభవంతు ఎన్‌జీవో హైదరాబాద్ వారు సేవా స్వర్ణనంది పురస్కారం లభించింది. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో ఇన్ సర్వీస్‌లో అగ్రికల్చర్ బీఎస్సీ విద్యను అభ్యసిస్తున్నాడు.

● ప్యాడీ ఆర్టిస్ట్‌గానూ...

దేశవాళీ వరి విత్తనాలతో ప్యాడీ ఆర్ట్ విధానాన్ని శ్రీనివాస్ అనుసరించారు. నల్లని వరిని వివిధ రూపాల్లో తీర్చిదిద్దడం ప్యాడీ ఆర్ట్‌గా ప్రాచుర్యం పొందుతున్నాయి. జపాన్‌వంటి దేశాల్లో పాడి ఆర్ట్ పేరున ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరుపుకుంటున్నారు. దీన్ని అధ్యయనం చేసి పొలంలో కాలాబట్టి వరి విత్తనంతో గోమాత, అయోధ్య రామమందిరం ఆకారంలో సాగు చేసి శ్రీనివాస్ ప్రత్యేకతను చాటుకున్నాడు.. గత సంవత్సరంలో భారతదేశ పటాన్ని 29 రాష్ట్రాలను తీర్చిదిద్దాడు.

బాల రచయిత సమ్మేళనంలో విద్యార్థినులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాల రచయిత సమ్మేళనంలో ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నేవూరి మీనాక్షి, దివ్యజ్యోతి పాల్గొన్నారని హెచ్ఎం మనోహరాచారి ఆదివారం తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఆన్‌లైన్ పోటీల్లో మొత్తం 101 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనంలో పద్య రచన విభాగంలో విద్యార్థినులు మీనాక్షి, దివ్యజ్యోతి పాల్గొన్నారని చెప్పారు.

ప్రమోషన్లలో నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

హుజూరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీ ఈ గ్రూప్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లలో 4శాతం రిజర్వేషన్లను అమలుచేయాలని తెలంగాణ ముస్లిం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆదివారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా అన్నిరంగాల్లో వెనుకబడిన ముస్లింలను విద్య, ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లను అమలు చేయడం జరిగిందన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకొని బీసీ ఈ గ్రూపులో కొనసాగుతున్న వారిని ప్రమోషన్లలో, రిజర్వేషన్లను అమలు చేయడానికి కృషి చేయాలన్నారు.

'పంచాయతీ' పోరుకు 'సహకార' నాయకులూ అర్హులే

కరీంనగర్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభంకావడంతో పల్లెల్లో రోజురోజుకు రాజకీయ వేడి రాజుకుంటోంది. 2023 జనవరి 31న గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియగా ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఔత్సాహిక అభ్యర్థులు పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో ఈసారి సర్పంచ్, వార్డుసభ్యుల పదవులకు తీవ్రపోటీ నెలకొంది. మొదటి విడత నామినేషన్ల సంఖ్య భారీగా పెరుగడమే ఇందుకు నిదర్శనం. 'పంచాయతీ' ఎన్నికల్లో పోటీచేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ పోటీకి తాము అర్హులమో కాదో తెలియక చాలా గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (సింగిల్ విండో) చైర్మన్లు, డైరెక్టర్లు, మత్స్య సహకార, గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలు, చేనేత సహకార సంఘాలు, సహకార బ్యాంకుల చైర్మన్లు, డైరెక్టర్లు అయోమయానికి గురవుతున్నారు. నిబంధనల ప్రకారం వారందరూ పోటీ చేసేందుకు అర్హులే.

● 15 రోజుల్లోగా రాజీనామా చేయాలి

సర్పంచ్‌గా గెలిస్తే 15 రోజుల్లో సహకార సంఘాల చైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. లేకపోతే సహకారశాఖ అధికారులే వారి పదవిని రద్దు చేస్తారు. చైర్మన్లు కాకుండా డైరెక్టర్లుగా ఉన్నవారు సర్పంచ్, వార్డుసభ్యులుగా కొనసాగే అవకాశం ఉంటుందని జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు తెలిపారు. గ్రామ సర్పంచ్, సహకార సంఘం చైర్మన్ రెండు పదవుల్లో కొనసాగే వీలుండదన్నారు.

బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- బీడీ కార్మిక సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథం

వేములవాడ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని బీడీ కార్మిక సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ కాశీవిశ్వనాథం డిమాండ్ చేశారు. వేములవాడలో ఆదివారం ఏఐటీయూసీ అనుబంధ సంస్థ అయిన ఆల్ ఇండియా బీడీ, సిగార్, టోబాకో వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీవిశ్వనాథం మాట్లాడుతూ బీడీ సంక్షేమ శాఖ ద్వారా కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్, ఇంటి నిర్మాణానికి సహాయం అందించాలని కోరారు. ప్రతీ జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్, సంచార వైద్యశాల మంజూరు చేయాలన్నారు. ఈపీఎఫ్‌వో ద్వారా కనీస పెన్షన్ ఆరు వేల రూపాయలు, దేశవ్యాప్తంగా వెయ్యి బీడీలకు 300 రూపాయలు వేతనం, ప్రతీనెల బీడీ కార్మికులకు బ్యాంక్ ద్వారా కాకుండా నేరుగా వేతనం చెల్లించాలని కోరారు. నెలలో 26 రోజులు పని ఉండేలా చూడాలని నాణ్యమైన తునికాకు, తాంబాకు కార్మికులకు సరిపడా వేయాలన్నారు. ఈపీఎఫ్‌వోలో ఆధార్‌తో సంబంధం లేకుండా క్లెయిమ్‌లను స్వీకరించాలన్నారు. బీడీ రంగంలోని అన్ని రకాల సమస్యలపై భవిష్యత్తు పోరాటాలు చేయాలని కార్మికులకు సూచించారు. డిసెంబరు నెలలో సేవ్ ఇండియా-సేవ్ బీడీ వర్కర్స్ నినాదంతో చలో ఢిల్లీ ప్రోగ్రామ్ నిర్వహిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం కేంద్ర మంత్రులను కలిసి సమస్యలను వివరిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో జాతీయ బీడీ కార్మిక సమాఖ్య నాయకులు నవాబ్, విలాస్, దేవదాస్, రాంబిలాస్ శర్మ, నభేందు గారా, శపన్ చందా , కడారి రాములు, అజ్జ వేణు, వడ్డెపెల్లి లక్ష్మణ్, అనసూర్య, రైసుద్దీన్, అసద్ జమాల్ కదేరి, యునస్, సుతారీ రాములు, ఆది రంగారెడ్డి, ముక్రమ్, గోవర్ధన్, లక్ష్మణ్. భానుచందర్, శాంత, గాజుల లింగం, కొక్కుల శాంతా, పండుగ పోచమల్లు, మోహినొద్దీన్, న్యాలపల్లి భారతి, సగున షర్మిల పాల్గొన్నారు.

గోదావరి వద్ద మల్లన్న భక్తుల రద్దీ


గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదిలో ఆదివారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని గోదావరి నదికి భారీగా భక్తులు తరలివచ్చి స్నానాలు చేశారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు డమరకం, త్రిశూలం, ఒగ్గు డోలు చేత పట్టుకుని బయలు దేరారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదెల, ఐనవోలు ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకునేందుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

ఎంపీలు బీసీ బిల్లుపై పార్లమెంట్‌లో ప్రశ్నించాలి


మాట్లాడుతున్న బీసీ సాధికారత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్

వేములవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుపై రాష్ట్రానికి చెందిన ఎంపీలు ప్రశ్నిస్తూ పట్టుబట్టాలని, పార్లమెంట్‌ను స్తంభింపజేయాలని బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ అన్నారు. వేములవాడ పట్టణంలోని బీసీ సాధికారిత కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు కల్పిస్తూ రాష్ట్ర ఉభయ సభల్లో ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. కేంద్రానికి పంపి తొమ్మిది నెలలు గడిచినా నెలలుగా ఉలుకు పలుకు లేకుండా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ జేఏసీ నేతలను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాన మంత్రిని, రాష్ట్రపతిని కల్పించి బీసీ బిల్లు ఆమోదం కోసం ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. లేనిపక్షంలో అసెంబ్లీనీ, పార్లమెంటును, ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ నేతలు ఇల్లందుల వెంకటేష్, ఉయ్యాల భూమయ్య, చింతలకోటి రామస్వామి, వాసంపెల్లి దేవయ్య, ప్రభాకర్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడాకారులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో ఆదివారం 8వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల వాలీబాల్ క్రీడా పోటీలను విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. పోటీలు డిసెంబరు 2వ తేదీ వరకు జరగనున్నాయి. క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యఅతిథులకు స్వాగతం పలుకుతూ విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథి ఆది శ్రీనివాస్ జ్యోతిప్రజ్వలన చేసి ఒలింపిక్, వాలీబాల్ అసోసియేషన్ జెండాలను ఆవిష్కరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వేదికపై ఉన్న ముఖ్య అతిథులకు 10 జిల్లాల క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ ద్వారా గౌరవ వందనం సమర్పించారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులను పూర్తిచేసుకొని శారీర, మానసిక ఉల్లాసం కోసం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో లాంటి గ్రామీణ క్రీడలను ఆడేవారన్నారు. కపిల్‌దేవ్ హయాంలో ప్రపంచ కప్ సాధించిన అనంతరం క్రికెట్ వంటి క్రీడలపై మొగ్గు చూపిన గ్రామాల్లో యూత్ క్లబ్‌లు, అసోసియేషన్స్ పెద్దల సహకారంతో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. వేములవాడలో వాలీబాల్, కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలతో పాటు జాతీయ వాలీబాల్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులకు కొదవలేదని మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులు ఉన్నారని, వారిని వెలికితీయడానికి క్రీడలను ప్రోత్సహిస్తామని తెలిపారు.

క్రీడలతో మనోవికాసంతో పాటు శారీరక ధారఢ్యం పెంపొందుతుందన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వాలీబాల్ క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయస్థాయిలో రాణించాలన్నారు. అనంతరం ముఖ్యఅతిథి ప్రభుత్వ విప్ వాలీబాల్ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జెల రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ హన్మంత్‌రెడ్డి, కోశాధికారి కృష్ణప్రసాద్, ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి గిన్నె లక్ష్మన్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధానకార్యదర్శి ఎ రాందాస్, సహాయ కార్యదర్శులు లక్ష్మణ్, రామస్వామి, రెఫరీ బోర్డు రాష్ట్ర చైర్మన్ గణపతి, కన్వీనర్ రవీందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవన్న, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, పోటీలో తలపడతున్న బాలికల జట్లు

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం


- పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని నర్సింగాపూర్ గ్రామం మోహినికుంట లక్ష్మీమల్లికార్జున స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయంనుబంతి పూలతో అలకరించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్స మార్గశిర బహుల దశమి ఆదివారం ఉదయం 11-59ని,లకు స్వామి వారి కళ్యాణోత్సవంను ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులను ఆసీనులను చేసి వేద మంత్రోచ్ఛఅల మధ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా పండితులు సంపత్ కుమార్‌శర్మ నిర్వహించినట్లు ఆలయ వంశపారంపర్య అర్చకులు మూడపల్లి భద్రయ్యశర్మ తెలిపారు. కల్యాణోత్సవంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆది శ్రీనివాస్‌ను శాలువతో ఘనంగా సత్కరించారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చింతపంటి రామస్వామి, పులి సత్తయ్య, శ్రీమన్ నారాయణ, ఏసుదాసు, ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఇన్‌స్పైర్ మనాక్ రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన విద్యార్థి


ప్రాజెక్ట్‌తో విద్యార్థి బండారి రాకేష్

వేములవాడ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బండారి రాకేష్ అనే విద్యార్థి ఇన్‌స్పైర్ మనాక్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా అందరినీ గుండె పోటు కబలిస్తున్న సందర్భంలో గ్యాస్ట్రిక్, అల్సర్ సంబంధిత సమస్యల లక్షణాలకు, గుండెపోటు లక్షణాలకు ఉన్న కొద్ది పాటు తేడాను గుర్తించకపోవడంవల్ల ఆకస్మిక మరణాలు అరికట్టడానికి పనిచేస్తుంది. ఏ వ్యక్తిలో అయినా హార్ట్ ఎటాక్ కన్నా ఆరు గంటల ముందు నుంచే హార్ట్‌బీట్ అసాధారణ పరిధిని సూచిస్తుంది. ఈ విధానంవల్ల ఐదు, ఆరు గంటల ముందుగా హార్ట్‌బీట్‌లో తేడాను డివైస్ ద్వారా కచ్చితంగా గుర్తించడం ద్వారా సరైన సమయంలో చికిత్స జరిపించి, తక్కువ శ్రమతో ప్రాణాన్ని కాపాడవచ్చని విద్యార్థి బండారి రాకేష్, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు భైరి సౌమ్య సహాయంతో తయారు చేసిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. విద్యార్థి రాకేష్ ప్రధానోపాధ్యాయురాలు మేకల మాధవీలత, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఉమామహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ పీఎంశ్రీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రావణ్‌తేజ, ఆయాన్ రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం మధుమాలతి ఆదివారం తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

వేములవాడలో భక్తుల రద్దీ

- ఎల్ఈడీ స్క్రీన్‌పై రాజన్న దర్శనం


స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో దాదాపు 25 వేలకు పైగా భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. వేలాదిమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కోడెల మొక్కులు చెల్లించారు. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేక పూజలు చేశారు. నిత్యఅన్నదాన సత్రం పైఅంతస్థులో కల్యాణం, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. స్వామివారికి మహాలింగార్చన, కుంకుమపూజలు, పెద్ద పల్లకీ సేవలు, ఆకుల పూజలు చేసి భక్తిప్రపత్తిని చాటారు. అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. రాజరాజేశ్వరస్వామి వారిని ఎల్ఈడీ స్క్రీన్‌పై దర్శించుకున్నారు. క్యూలైన్, తలనీలాలు, అభిషేకాలు తదితర చోట్ల ఈవో రమాదేవి పరిశీలించారు.

● వైభవంగా రుద్రాభిషేకం

గీతా జయంతి ఉత్సవాల సందర్భంగా రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి 11మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నాగిరెడ్డి మండపంలో ఏకాంతంగా పరివార దేవతలకు అర్చనలు, గీతా హోమం నిర్వహించారు. అనుబంధ ఆలయాల్లో అర్చనలు నిర్వహించారు.

● బద్దిపోచమ్మకు బోనాలు

భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటలు పట్టింది.

● సిద్దిపేట, జగిత్యాల ఎన్నికల అబ్జర్వర్ల పూజలు

వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర ఆలయంలో స్వామివారిని సిద్దిపేట ఎన్నికల అబ్జర్వర్ హరిత, జగిత్యాల్ ఎన్నికల అబ్జర్వర్ బి రమేష్ దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి ఇష్టమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా మల్లన్న బోనాల జాతర

ఇబ్రహీంపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం గ్రామ శివారులోని గుట్టపైన గల మల్లికార్జునస్వామి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో జాతర ఘనంగా సాగుతోంది. మండలంలోని గోదూర్ గ్రామానికి చెందిన పలువురు యాదవ కులస్తులు, మహిళలు బోనాలతో మల్లన్న దర్శనానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఒగ్గుడోలు కళాకారులు తమ ఆటపాటలతో సందడి చేస్తూ, మల్లన్న పాటలను ఆలపిస్తూ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్న స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించి, తంతును పూర్తి చేశారు. సాయంత్రం పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మల్లన్నను దర్శించుకుని, తమ కోరికలను వేడుకున్నారు. ఈ వేడుకల్లో యాదవ సభ్యులు, వీడీసీలు, భక్తులు పాల్గొన్నారు.


బోనాలతో బయలుదేరిన భక్తులు

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలి


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ రమణారావు

ఎలిగేడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. శనివారం రాత్రి శివపల్లిలో జూలపల్లి మండల కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులంతా కలిసికట్టుగా బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామగ్రామాన వివరిస్తూ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం కష్టపడాలని అలాగే ప్రతిపక్షాలు అవలంభించే తీరును ప్రజలకు ఎప్పటికప్పుడు తెలుపాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కోసం కట్టుదిట్టంగా పని చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, సింగిల్ విండో చైర్మన్లు, పాల్గొన్నారు.

కాలినడకన శబరిమల అయ్యప్ప దర్శనం

ఎలిగేడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాలినడకన కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకోవడం మహాభాగ్యమని హైకోర్టు న్యాయవాది బుర్ర వీరస్వామిగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన బుర్ర అజయ్‌గౌడ్‌ను ఆయన సన్మానించారు. అజయ్ గౌడ్ మాలధారణ వేసుకొని 48 రోజుల్లో 1550 కిలోమీటర్లు మహాపాదయాత్ర చేసి స్వామిని దర్శించుకున్నాడు. కవ్వంపల్లి చంద్రయ్య, రంగు శ్రీనివాస్, తాటిపల్లి సతీష్‌బాబు, రమేష్, ఐట్ల శ్రీనివాస్, గుర్రం మల్లేశం, బుర్ర గణేష్, మహిళ భక్తులు పాల్గొన్నారు.

సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయాలి


ఎస్ఐ చంద్ర కుమార్

సుల్తానాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు సమస్యలు ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఉన్నారని ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. ఆదివారం ఎస్ఐగా చంద్రకుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ఇరవై నాలుగు గంటలు పని చేస్తామన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించవద్దని, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవ న్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలుతోపాటు చట్ట వ్యతిరేకులపై ఉక్కు పాదం మోపుతామన్నారు. ఎస్ఐ చంద్ర కుమార్‌కు సిబ్బందితో పాటు పలువురు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ


మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, నవంబరు (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ది చెందిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి తరలివచ్చిన భక్తులంతా ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి, స్వామివారికి కోడేమొక్కులను సమర్పించారు.

సామాజిక సేవకుడికి సన్మానం


స్వామిని అభినందిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బొల్లి స్వామిని ఆదివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అభినందించారు. 40 సంవత్సరాలుగా సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నందున అతనికి అంబేడ్కర్ పూలే జాతీయ అవార్డు దక్కింది. స్వామికి అవార్డు పొందడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, పాలకుర్తి రాజేశం, దేవి జనార్ధన్, మెడవేని తిరుపతి, సోగాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మొదలైన రెండో విడత నామినేషన్లు


కొత్తూర్‌లో నామినేషన్ వేస్తున్న చామనపల్లి సర్పంచ్ అభ్యర్థి


జీడీనగర్‌లో నామినేషన్ వేస్తున్న సర్పంచ్ అభ్యర్థి


జూలపల్లిలో మద్దతుగా వచ్చిన మాజీ ఎమ్మెల్యే దాసరి

ధర్మారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్లు ఆదివారం ప్రారంభమయ్యాయి. మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా 266 వార్డులు ఉన్నాయి. ఇందులో మొదటి రోజు ఆదివారం సర్పంచ్ స్థానాలకు 25 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. బొమ్మరెడ్డిపల్లి, బొట్లవనపర్తి, బుచ్చయ్యపల్లి, చామనపల్లి, దొంగతుర్తి, గోపాల్‌రావుపేట, కమ్మరిఖాన్‌పేట, కటికెనపల్లి, ఖానంపల్లి, కొత్తూరు, లంబడితండా (కె), లంబడితండా (బి), నర్సింహులపల్లి, పత్తిపాక, రచ్చపల్లి, సాయంపేట గ్రామాల నుండి ఒక్కో అభ్యర్థి నామినేషన్ వేశారు. మ్యాడారం, నర్సింగాపూర్ గ్రామాల నుంచి ఇద్దరు చొప్పున నామినేషన్ వేయగా, మల్లాపూర్ నుండి ముగ్గురు నామినేషన్ సమర్పించారు.

266 వార్డు స్థానా లకు గాను మొదటి రోజు కేవలం 46 మంది అభ్యర్థులు మాత్రమే నామినేషన్ వేశారు. చామనపల్లి, కమ్మరిఖాన్ పేట, ఖిలావనపర్తి, నర్సింగాపూర్, పైడిచింతలపల్లిలో ఒక్కొక్కరు నామినేషన్ వేయగా, బుచ్చయ్యపల్లి, బొట్ల వనపర్తి, కొత్తూరు, నర్సింహులపల్లి, పత్తిపాక గ్రామాల్లో ఇద్దరి చొప్పున నామినేషన్ వేశారు. కటికెనపల్లి, మల్లా పూర్ గ్రామాల్లో ముగ్గురు, ధర్మారం, మేడారం గ్రామా ల్లో నలుగురు నామినేషన్ దాఖలు చేశారు. గోపాల్‌రావుపేటలో ఐదుగురు, దొంగతుర్తి, ఖానంపల్లి గ్రామాల్లో ఆరుగురు నామినేషన్ వేశారు.

పాలకుర్తి/అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లుగా పోటీ చేస్తున్న 32 మంది, వార్డు సభ్యులుగా 44 మంది నామినేషన్లు వేశారు. అంతర్గాం మండలంలో 15 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లుగా 12 మంది, వార్డు సభ్యులుగా 15 మంది ఆదివారం నామినేషన్ల పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఆదివారం కావడంతో మందకొడిగా నామినేషన్లను అభ్యర్థులు సమర్పించారు. ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద ఎస్ఐలు నూతి శ్రీధర్, బి వెంకటస్వామిల ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు 22 మంది సర్పంచ్‌లు, 36 మంది వార్డు సభ్యులకు నామినేషన్లు వేశారు. జూలపల్లిలో వార్డు మెంబర్లకు 4, అబ్బాపూర్‌లో సర్పంచ్ ఐదుగురు వార్డుమెంబర్లకు 4, బాల్‌రాజ్‌పల్లిలో సర్పంచ్, వార్డు మెంబర్‌కు 3, చీమలపేటలో సర్పంచ్‌కు 2, వార్డుమెంబర్‌కు 5, కాచాపూర్‌లో సర్పంచ్, వార్డుమెంబర్‌కు 3, కీచులాటపల్లిలో సర్పంచ్, వార్డుమెంబర్‌కు 2, కోనరావ్‌పేట సర్పంచ్‌కు 2, వార్డుమెంబర్లకు 7, కుమ్మరికుంట సర్పంచ్‌కు 2, వార్డుమెంబర్లకు 5, పెద్దాపూర్ సర్పంచ్‌కు 2, వార్డుమెంబర్‌కు 3, తెలుకుంటలో సర్పంచ్ 1, వెంకట్రావుపల్లిలో సర్పంచ్‌కు 1, నామినేషన్లు దాఖలయ్యాయి. తెలుకుంట, వెంకట్రావుపల్లిలో వార్డుసభ్యులకు నామినేషన్లు దాఖాలు కాలేదు. వడ్కాపూర్, జూలపల్లి, నాగులపల్లి సర్పంచ్, వార్డు స్థానాలకు ఇంకా నామినేషన్ దాఖలు చేయలేదు. పెద్దాపూర్‌లో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న తొగరి శ్రీనివాస్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నామినేషన్ కేంద్రానికి తరలివచ్చారు.

ఉంగరం... కత్తెర...
(5వ పేజీ తరువాయి)



స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్, కుండ,డిష్ యాంటీనా, గరాటా, మూకుడు. ఐస్ క్రీమ్, గాజు గ్లాస్, పోస్ట్ డబ్బా, ఎన్వలప్ కవర్, హాకీ స్టిక్ బాల్, నెక్ టై, కటింగ్ ప్లేయర్, పెట్టే, విద్యుత్ స్తంభం, టీ కెటిల్ గుర్తులను కేటాయించారు. ఈ ఎన్నికల్లో నోటా గుర్తును కూడా కేటాయించనున్నారు. బ్యాలెట్ పేపర్‌లో నోటాకు ఓటు వేయాలనుకునే వారు కొట్టివేత మార్కు వేసే అవకాశం కల్పించారు. బ్యాలెట్ పేపర్లో అందరి అభ్యర్థుల తర్వాత చివరలో నోటా గుర్తు ముద్రిస్తారు.

సర్పంచ్ స్థానాలకు పోటాపోటీ


ఏకగ్రీవమైన వార్డుమెంబర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు పోటాపోటీగా నామినేషన్లు వేశారు. 24 గ్రామపంచాయతీల్లో 53 వార్డులు ఏకగ్రీవం కాగా, అందులో గెలిచిన కాంగ్రెస్ వార్డు మెంబర్లను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్‌లు సన్మానించారు. మండలంలో 24 గ్రామపంచాయతీలకు 172 మంది సర్పంచ్‌లు, 226 వార్డులకు 410 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 53 వార్డుల్లో ఒక్కరే నామినేషన్ వేయగా, వారు ఏకగ్రీవమైనారు. సర్పంచ్‌లుగా బరిలో ఉన్న వారు తమ అనుకూల వారిని గెలిపించేందుకు మరికొంత మందిని ఉపసంహరించుకునేలా నాయకులు పాట్లు పడుతున్నారు. గతంలో లక్ష్మీపురం ఏకగ్రీవం కాగా ప్రస్తుతం ఇక్కడ పోటీ నెలకొంది. అన్ని గ్రామాల్లో దాదాపు సర్పంచ్ పదవికోసం పోటీ తీవ్రస్థాయిలో ఉండ నున్నది. గ్రామాల్లో డబ్బులు, మద్యం ప్రచా రం మొదలు కాకముందే దావత్‌ల పేరుతో జోరుగా నడుస్తున్నది.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామపంచాయతీ నామినేషన్ల తొలి విడత నామినేషన్లు పూర్తయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో వార్డు సభ్యులు ఏకగ్రీవంగా కాగా సర్పంచ్, వార్డు సభ్యులు ప్రచారాలకు సిద్ధమవుతున్నారు. 16 గ్రామపంచాయతీలకు 160 మంది సర్పంచ్‌లు నామినేషన్లు దాఖలు చేయగా 123 మంది అభ్యర్థుల నామినేషన్లు అంగీకరించారు. అదే విధంగా 158 వార్డుల్లో 449 అభ్యర్థులు నామినేషన్ల వేయగా అందులో 436 నామినేషన్లు అంగీకరించారు. వార్డు సభ్యులు దాఖలు చేసిన రెండు, మూడు సెట్ నామినేషన్‌లు 9 ఉండగా 4 నామినేషన్లు వివిధ కారణాలచే తిరస్కరించినట్లు ఎంపీడీవో తెలిపారు. పది గ్రామపంచాయితీల్లో వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. అందులో ఆదివారంపేట్‌లో 6వార్డు, బేగంపేట్ 4, 5, 12, చందనాపూర్ 1, జల్లారం 10, కల్వచర్ల 12, లొంకకేసారం 1, 3, పన్నూరు 9, పెద్దంపేట్ 2, 3, 5, 6, 7, 8, 9, రాజాపూర్ 1, రత్నాపూర్ 4వ వార్డులు ఏకగ్రీవం అయినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. నామినేషన్ల పూర్తి కావడంతోనే అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోనేందుకు ప్రచారాలను ముమ్మరం చేస్తున్నారు.

ముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ నుంచి జిల్లెలపల్లి ఇటీవల వేరు పడి గ్రామ పంచాయతీగా ఏర్పడింది. జిల్లెలపల్లి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడటంతో మొదటి సారి జరుగనున్న ఎన్నికల్లో పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. 500 మంది గ్రామస్తులున్న గ్రామంలో మొదటి సారి పంచాయతీ ఎన్నికలు జరుగుతుండటంతో మొదటి సర్పంచ్‌గా గెలవాలని అభ్యర్థులు ఉత్సాహంగా నామినేషన్లు వేశారు. ముత్తారం మండలంలోని15 గ్రామ పంచాయతీలుండగా అత్యధికంగా13 మంది అభ్యర్థులు ఈ గ్రామం నుంచి బరిలో నిలిచారు.

మండలంలో 5 క్లస్టర్ల పరిధిలో మొత్తం 15 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు చేపట్టనున్నారు. మొత్తం 15 సర్పంచ్ స్థానాలకు, 138వార్డు స్థానాలకు ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. అయితే నామినేషన్ చివరి రోజు శనివారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. అనంతరం స్క్రూటీని చేపట్టారు. స్క్రూటీని ముగిసే వరకు 15 సర్పంచ్ స్థానాలకు 89 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 138 వార్డు స్థానాల్లో 20 వార్డులకు ఒకే నామినేషన్ రావడంతో స్క్రూటీని ముగిసే అనంతరం అవి ఏకగ్రీవం అయ్యాయి. అయితే ప్రస్తుతం 118 వార్డు మెంబర్ స్థానాలకు 311 మంది బరిలో ఉన్నారు.

బీసీల గొంతు నొక్కేందుకే అగ్రవర్ణాల కుట్ర

పెద్దపల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీల గొంతు నొక్కేందుకే అగ్రవర్ణాలు కుట్ర చేస్తున్నాయని టీఆర్‌పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉదయ్, స్వామి, ప్రగతి మత్స్య కార్మిక సేవాసమతి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ నల్గొండ జిల్లా ఎల్లమ్మగూడెంకు చెందిన నాగలక్ష్మి సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేస్తుండగా ఆమె భర్త యాదగిరిని కొందరు అపహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. నామినేషన్ పత్రాన్ని ఉపసంహరించుకోవాలని బెదిరించి చిత్రహింసలకు గురిచేశారని, ఈ ఘటన బీసీ వర్గంపై జరుగుతున్న దాడి అని వారు ఖండించారు.

సత్యనారాయణ నేత్రాలు సజీవం

కళ్యాణ్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌కు చెందిన సత్యనారాయణ మృతి చెందగా ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఐ బ్యాంకు టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు తరలించారు. స్ఫూర్తి అధ్యక్షుడు మామిడి శ్రీధర్ మాట్లాడుతూ సత్యనారాయణ కుమారులు సతీష్, రమేష్, సురేష్, నరేష్ నేత్రాలకు దానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. విజేందర్, సతీష్, నార్ల ప్రసాద్, రాజేందర్, కోదాటి ప్రవీణ్, చందర్ గుప్తా పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి, చండీ హోమం

మంథని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని లక్ష్మీగణపతి, చండీ హోమాన్ని అవధాని శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పండితులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. కొమురవెల్లి సావిత్రి-సమ్మయ్య, భక్త బృందం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భవాని శంకర అన్న పూజ, అమ్మవారి శోభాయాత్రను నిర్వహించారు. తీర్థ, ప్రసాదాలను అందించారు.

గంజాయి సేవిస్తున్న యువకుల పట్టివేత


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్

తిమ్మాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో గంజాయిని సేవిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకున్నారు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్‌లోని తిరుమల హోమ్స్ ఏరియాలో ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తున్న సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లగా వారు పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఇద్దరిని పట్టుకోగా ఒకరు పారిపోయారు. వారి వద్ద తనిఖీ చేయగా 110 గ్రాముల గంజాయి దొరికింది. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం, జయ్యారం గ్రామానికి చెందిన కోరండ్ల రఘువర్దన్‌రెడ్డి, అదే గ్రామానికి చెందిన చింతకింద శ్రీకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. రఘువర్దన్‌రెడ్డి లారీ డ్రైవర్‌గా పని చేస్తూ తిరుమల హోమ్స్‌లో గది అద్దెకు తీసుకుని శ్రీకృష్ణతోపాటు ఉంటున్నాడు. శ్రీకృష్ణ తిమ్మాపూర్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. కొంత కాలంగా వీరు తిమ్మాపూర్‌లోని ఒక హాస్టల్‌లో ఉంటున్న యువకుడి వద్ద గంజాయి కొనుక్కుని సేవిస్తున్నారు. వీరికి గంజాయి ఇచ్చిన వ్యక్తి పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుంచి గంజాయితోపాటు మొబైల్, రెండు గంజాయి తాగే భంగ్ డబ్బాలను, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి సరుకుల అందజేత

జ్యోతినగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ 23వ డివిజన్‌కు చెందిన ఎల్లబోయిన శ్రీనివాస్ కుటుంబానికి ఆదివారం పలువురు దాతలు ముందుకు వచ్చి ఆదుకొన్నారు. శ్రీనివాస్ పోలియో పేషెంట్‌గా ఉండటంతో పాటు అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. దంపతులు కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అతనికి ఆరునెలల క్రితం ఇంట్లో జారిపడగా కాలు విరిగింది. వారి బాధను తెలుసుకున్న గ్రూప్ సభ్యులు శేఖర్ శ్రీసీతారామ సేవా సమితి దృష్టికి తీసుకువచ్చారు. 50 కేజీల బియ్యం, రెండు నెలలకు సరిపోయేలా నిత్యావసర సరుకులు అందించారు. విషయం తెలిసిన మరో గ్రూప్ సభ్యుడు దర్శికోటి నాగకార్తీక్ రూ.2 వేలు అందించారు. గోలివాడ చంద్రకళ, కంది సుజాత, బిల్లా శ్రీదేవి, కొండు రమాదేవి, కట్కూరి శాంతి, కొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితుడికి నీడ చేయూత

కోల్‌సిటీటౌన్, నవంబర్ 30(ఆంధ్రజ్యోతి): కేన్సర్‌తో బాధపడుతున్న విఠల్‌నగర్‌కు చెందిన గాజుల సతీష్‌కు ఆదివారం ఎన్ఆర్ఐ అలుగుబెల్లి వేణుగోపాల్ నీడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.5వేలు సహాయం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు పల్లెర్ల రమేష్ మాట్లాడుతూ డ్రైవర్‌గా పనిచేసే సతీష్ 8నెలలుగా కేన్సర్‌తో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడని, విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ వేణుగోపాల్ 50వ జన్మదినం సందర్భంగా సతీష్ ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. నాయకులు చుక్కల శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



సింగరేణి పరిరక్షణకు 'సింగరేణి పోరుగర్జన'

- జనవరి 2 నుంచి 20వరకు గోలేటి నుంచి సత్తుపల్లి వరకు..
- రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సంఘాల నాయకులు

గోదావరిఖని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, టీఎస్‌యూఎస్, ఏఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఎస్‌జీకేఎస్, ఐఎఫ్‌టీయూ ఏడు కార్మిక సంఘాల సమావేశం ఆదివారం హెచ్ఎంఎస్ కార్యాలయంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అధ్యక్షతన జరిగింది. నాయకులు సింగరేణి పరిరక్షణ కోసం చర్చించి కార్మికులకు పిలుపునిచ్చారు. ఈనెల 14న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్మిక సంఘాలు, మేధావులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించానికి నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు ఉద్యమించాలని, నాలుగు బొగ్గు బ్లాకులు సింగరేణికే చెందేటట్టుగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడాలని, కార్మికులు ఎదుర్కొంటున్న మెడికల్ బోర్డును యథావిధిగా కొనసాగించాలన్నారు. మారుపేరు కార్మికుల వారసులకు ఉద్యోగాలు కల్పించడంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా, సింగరేణి భవిష్యత్ కోసం సింగరేణి పోరుగర్జన నిర్వహిస్తున్నట్టు, జనవరి 2 నుంచి 20వరకు నిర్వహిస్తున్నట్టు, కార్మిక వర్గం అంతా కలిసికట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జీఎల్‌బీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ కృష్ణ, టీఎస్‌యూఎస్ అధ్యక్షుడు కామర గట్టయ్య, ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు జీ రాములు, టీఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు, ఎస్‌జీకేఎస్ అధ్యక్షులు ఎస్ మహేందర్, నాయకులు రాజయ్య, ఎం కుమారస్వామి, దావు రమేష్, రవి, చింతల శేఖర్, కొండి శ్రీనివాస్, ఎంఏ బేగ్, రాజపోషం పాల్గొన్నారు.

కోల్ ఇండియా కబడ్డీ పోటీల్లో రన్నరప్‌గా సింగరేణి జట్టు


రన్నరప్ బహుమతితో సింగరేణి కబడ్డీ జట్టు

గోదావరిఖని, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్‌లో ఈనెల 28 నుంచి 30వరకు జరిగిన కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీల్లో సింగరేణి జట్టు రన్నరప్‌గా నిలిచింది. దేశ వ్యాప్తంగా ఉన్న బొగ్గు రంగ సంస్థల్లో ఉన్న సింగరేణి (తెలంగాణా), డబ్ల్యూసీఎల్(మహారాష్ట్ర), ఎన్‌సీఎల్ (ఉత్తరప్రదేశ్), ఎంసీఎల్(ఒరిస్సా), ఎస్ఈసీఎల్ (ఛత్తీస్‌గడ్), ఈసీఎల్(వెస్ట్ బెంగాల్), సీసీఎల్(జార్ఖండ్), బీసీసీఎల్(ధన్బాద్) 8జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఫైనల్‌లో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో విజేతగా డబ్ల్యూసీఎల్ (నాగపూర్), రన్నరప్‌గా సింగరేణి జట్టు, తృతీయ స్థానం ఎస్ఈసీఎల్ (ఛత్తీస్‌గఢ్) విజయంసాధించింది. ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా సింగరేణి సీఎండీ బలరాం నాయక్ హాజరై మ్యాచ్‌ను వీక్షించి విజేత జట్లకు మెడల్స్, బహుమతులు ప్రధానం చేశారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

గోదావరిఖని, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ కరీంనగర్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అవసరమైన వారికి వివిధ ఆరోగ్య బీమా కింద ఆపరేషన్‌లు చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరంలో వంద మందికి పైగా హాజరు కాగా డాక్టర్ మైథిలి పరీక్షలు నిర్వహించారు. ఆర్జీ-1 బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు కే మైథిలి, హాస్పిటల్ మేనేజర్ యాదగిరి, హాస్పిటల్ సిబ్బంది రమేశ్, అజయ్, అన్వేష్, స్నేహ, తొడుపునూరి రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి వివేక్ జన్మదినం


వివేక్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ జన్మదినాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఓల్డ్ అశోక థియేటర్ వద్ద కేక్‌కట్ చేసి మహిళలకు, వృద్ధులకు చీరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. కామ విజయ్ ఆధ్వర్యంలో అమ్మ పరివార్ అనాథ ఆశ్రమంలో పండ్లు, అన్నదానం చేశారు. దుబాసి మల్లేష్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు గోపాల్‌రావు, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, నాయకులు కుమారస్వామి, బాబర్ సలీం పాషా, లలిత, కల్వల సంజీవ్, బోయిని మల్లేష్, మధు, సురేందర్, హకీం పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంత్రి గడ్డం వివేక్ జన్మదినం పురస్కరించుకొని ఆలయంలో అర్చనలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. అల్లం సతీష్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ ఐలయ్య, మాజీ ఎంపిటిసి ఆవుల ముత్తయ్య, రవి, పల్కల సాగర్ రెడ్డి, రవీందర్, కరుణాకర్ రెడ్డి, గీస రాజు, రవీందర్ పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనింగ్, కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాడె సూర్యనారాయణ కేట్ కట్ చేశారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ చౌక్‌లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. సెగ్యమా దయాకర్, అడ్డగుంట శ్రీనివాస్ గౌడ్, తాటిపల్లి రమేష్‌బాబు, చింతకుంట మనోహర్‌రావు, మండిగ రాజనర్సు ప్రకాష్, కుమార్ పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): మంత్రి గడ్డం వివేక్ జన్మదినం సందర్భంగా ఎన్టీపీసీ సాయి సేవా సమితిలో ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకుడు బాబర్ సలీం పాషా, వంశీ యువ సేన నాయకులు జావీద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చందర్, కోటేశ్వర్లు, దుబాసి మల్లేష్, శ్రావణ్, తాని శ్రావణ్ కుమార్, జమీల్, వినోద్, పాల్గొన్నారు.